ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
5
అల్లూరి సీతారామరాజు



మేకలపై చిరుత పులి దాడి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామానికి చెందిన గిరిజనులకు చెందిన నాలుగు మేకలపై చిరుత పులి దాడి చేసింది. గురువారం మేత కోసం గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి పశువుల కాపరులు తీసుకువెళ్లారు. గమనించిన చిరుత పులి మేకల మందపై దాడి చేసిందని గిరిజన రైతులు తెలిపారు. ఫారెస్ట్ శాఖ అధికారులు చిరుత పులిని బంధించి తమ మేకలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



గాయపడ్డ మేక

దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

-టీచర్లు పాఠశాలలకు సకాలంలో హాజరు కాలేదు-మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి, హాజరైన జెడ్పిటిసి గంగరాజు, అధికారులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని విద్యా వ్యవస్థ దిగజారుతోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని, ప్రజాప్రతినిధులు ప్రోటోకాల్ పాటించ లేదని జెడ్పిటిసి, ఎంపీపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన మండల సభ్య సమావేశం గురువారం వాడివేడిగా జరిగింది. ఈ సమావేశంలో హాజరైన ఎంపిటిసి, సర్పంచ్‌లు మాట్లాడుతూ, ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలో విద్యా వ్యవస్థ దారుణంగా ఉందని నిలదీశారు. పాఠశాలలకు టీచర్లు సమయానికి హాజరు కాలేదని, కొన్ని పాఠశాలలు వాలంటీర్లతో కొనసాగుతున్నాయన్నారు. అనంతగిరి ఎంపీపీ మాట్లాడుతూ, ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి, అరకు ప్రాంతాలకు అదనపు బస్సు సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, గుమ్మకోట నుండి పాడేరు, దేవరాపల్లి నుండి పాడేరుకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. మండల కేంద్రంలో అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచాలన్నారు. సభకు హాజరు కాని విన్నకోట, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానం చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నగేష్, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, ఎంఈఓ బాలాజీ, ఏటిడబ్ల్యు వెంకటరమణ, ఏవో ఉమామహేశ్వరి, వైస్ ఎంపీపీలు జయవర్ధని, శకుంతల, ఎంపీటీసీలు తటినాయుడు, అశోక్, సర్పంచ్ సన్యాసిరావు, రూతు అప్పారావు, రాములమ్మ పాల్గొన్నారు



చెక్కును అందజేస్తున్న డిఆర్ఓ

కలుషిత ఆహార ఘటనలో...

ఇద్దరు విద్యార్థులకు రూ.లక్ష పరిహారం

ప్రజాశక్తి-పాడేరు:ఇటీవల కలుషిత ఆహారం తీసుకున్న ఘటనలో ఆసుపత్రుల్లో చేరి డిశ్చార్జ్ అయిన మరో ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని డి.ఆర్.ఓ బి.పద్మావతి గురువారం అందజేశారు. ఈనెల 17వ తేదీన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఒక అనాథ ఆశ్రమంలో తీసుకున్న ఆహారం కలుషితం కావడంతో ముగ్గురు విద్యార్థులు చనిపోయిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మర్రి రంజిత్, కొర్ర సుశాంత్ కుటుంబ సభ్యులకు డిఆర్ఓ తన చాంబర్ లో చెక్కులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేని అనధికార వసతి గృహాలలో చేరవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులను కోరారు.



పాఠశాల సిబ్బందిని విచారణ చేస్తున్న అధికారులు

బోదులూరు పాఠశాలలో వేధింపులపై విచారణ

ప్రజాశక్తి- మారేడుమిల్లి

మండలంలోని బోదులూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులను ఎఎన్ఎం, ఉపాధ్యాయురాలు చేస్తున్న వేధింపులపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. ఎఎన్ఎం, ఉపాధ్యాయురాలి వేధింపులపై స్థానిక సర్పంచ్ ప్రేమలతకు గిరిజన విద్యార్థులు ఫిర్యాదు చేసి, తమ గోడు వెల్లబుచ్చుకున్న వార్తలు రావడం, వీడియోలు వైరల్ కావడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గురువారం ఉదయం తహశీల్దారు సుబ్బారావు, ఏటిడబ్ల్యుఓ రామతులసి, సీఐ రుద్దరాజు భీమరాజు పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సిబ్బంది చెప్పినట్లు వినకపోతే గదిలోపెట్టి కొడుతున్నారంటూ విద్యార్థినులు విచారణ అధికారుల ముందు చెప్పారు. హెచ్ఎమ్‌కు తెలిపినా వారికే సపోర్టు చేస్తూ మరింత టార్చర్ చేస్తున్నారని విద్యార్థినులు కన్నీటిపర్యాంతమయ్యారు. తమ ఇబ్బందులను చెప్పుకుందామంటే వినే నాథులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఎన్ఎం తమకు మందులు ఇవ్వకుండా, దుర్భాషలాడుతున్నారని తెలిపారు. తాము ప్రశాంతంగా చదువుకోవాలంటే వార్డెన్, నర్సు, హెచ్ఎమ్‌లను మార్చాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బందిని, విద్యార్థినిలను ఒక్కొక్కరిని విచారించామని చెప్పారు. విద్యార్థినులను సిబ్బంది కొట్టడం వాస్తమేనని, ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తహశీల్దారు సుబ్బారావు తెలిపారు.

గ్రేడ్ 4,5 కార్యదర్శులను గిరిజన ప్రాంతంలోనే ఉంచాలి

ప్రజాశక్తి -పాడేరు:ఏజెన్సీ నుంచి గ్రేడ్ 4,5 కార్యదర్శులను మైదాన ప్రాంతానికి బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసనను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఫోరమ్ నాయకులు వి.రమేష్, కె.త్రినాథ్, వి.లక్ష్మణ్ మాట్లాడుతూ, జిఓ 3 ప్రతిపదికన సచివాలయంలో 100 శాతం నియామకం జరిగిందని, ఐదు సంవత్సరాల పాటు గిరిజన ప్రాంతంలో గిరిజనులకి సేవలు అందించడం జరిగిందని, వీరిలో మూడు సంవత్సరాలు పూర్తి చేసిన వారిని ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉన్నా చేయలేదని తెలిపారు. గిరిజన ప్రాంతంలో మైదాన ప్రాంతం నుండి వచ్చిన ఉద్యోగులకు భాష పరంగా, పాలన ఇబ్బందులు ఎదురు అవుతుందన్నారు. దీంతో అర్హులకి సంక్షేమ పథకాలు అందకుండా పోతుందన్నారు. గిరిజన ప్రాంతంలో పని చేస్తున్న కార్యదర్శులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి గిరిజన ప్రాంతలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. దీనికీ ప్రభుత్వం అనుకూలంగా స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సుభాష్‌చంద్ర, ఎం.బాబురావు, శివ శంకర్, నీలకంఠం, నర్సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్‌ల ఫోరమ్ నాయకులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి అభిషేక్

క్రీడలతో మానసిక ఉల్లాసం

-జెసి అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: క్రీడలతో మానసిక ఉల్లాశంతో పాటు శారీరక ధారుడ్యం మెరుగుపడుతుందని, ఆరోగ్య వంతులుగా ఎదుగుతారని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం.జే.అభిషేక్ తెలిపారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం పురష్కరించుకుని తలారిసింగ్ ఇన్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని అభిలషించారు. క్రీడాకారులకు మంచి గుర్తింపు లభించే విధంగా నిరంతర క్రమశిక్షణ ప్రాక్టీస్ కొనసాగించాలని, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా జేసి విద్యార్థినీ విధ్యార్థులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాదికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు డి.ఆర్.ఓ బి. పద్మావతి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ అధికారి కే.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

- రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని వివిధ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఆదేశించారు. ఆశ్రమ హాస్టళ్లకు ఈ ఏడాది సెప్టెంబర్, నుండి నవంబర్ వరకు మూడు నెలల పాటు కాయగూరలు, కోడి మాంసం, అరటి పండ్లు, కోడిగుడ్లు సరఫరా చేసేందుకు టెండర్లు దాఖలు చేసిన వెండర్లతో ప్రాజెక్ట్ అధికారి గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ టెండర్లు ఖరారు చేసిన వెండర్లు ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు, కోడి మాంసం, అరటి పండ్లు, గుడ్లు సరఫరా చేసి ఎప్పటికప్పుడు బిల్లులు సమర్పించాలని సూచించారు. సరఫరా చేయడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా చేయడానికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాళ్లు ప్రసన్న, ఆలీషా, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, జల్లి చెంబుడు, సీనియర్ సహాయకులు అర్చన రమణి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రతి నెలా 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక రోజు ముందుగానే ఈనెల 31న శనివారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఎంపిడిఓలు శుక్రవారమే అవసరమైన పింఛన్ నగదును డ్రా చేసి 31వ తేదీన పంపిణీ చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం దినం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కలెక్టర్ వివరించారు. సామాజిక పెన్షన్ల పంపిణీకి ఆగస్టు 31వ తేదీన అందుబాటులో లేని వారికి సెప్టెంబర్ 2వ తేదీన (సోమవారం) పంపిణీ చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. జిల్లాలోని 11 మండలాలలో 1,25,261 మంది ఫించన్ లబ్దిదారులు ఉన్నారన్నారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ



ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కల్పశ్రీ 2022 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. కాగా ఇప్పటివరకు రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎస్ ప్రశాంత్ కుమార్‌ను విజయవాడ కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నిర్వాసితుల సమస్యలపై స్పందించిన సిఎంఓ

ప్రజాశక్తి-దేవీపట్నం : నిర్వాసితుల సమస్యలపై సిఎమ్‌ఓ స్పందించింది. పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ, పునరావాసం, భూమికి భూమి వంటివి కల్పించకపోవడం, దేవీపట్నం పూడిపల్లి పునరావాస కాలనీ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంపై దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు గేదెల చిన సుబ్బారావు, లంకా హరిచంద్రుడు, దొడ్డ సింహాద్రి, లంకా పోసిరావు, సిద్దా నారాయణ స్వామి తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలిసారి అమరావతిలో నిర్వహించిన గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు సిఎంఒ స్పందిస్తూ పరిష్కారానికి ఈ అర్జీని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు పంపినట్టు తెలిసింది.




అధికారులతో మాట్లాడుతున్న పిఒ

వచ్చే నెలలో ఆదర్శ గురుకుల పాఠశాల పారంభం

-ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను భారత ప్రధానమంత్రి వచ్చేనెల 5 నుంచి 9 తేదీల మధ్య ప్రారంభిస్తారని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. మండలంలోని లకే పుట్టు గ్రామం వద్ద రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల (ఈ ఎం ఆర్ ఎస్) నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. తరగతి గదులు, లాబరేటరీలు, డైనింగ్ హాల్ , వసతి గృహం తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, పెదబయలు, అరకు వ్యాలీ, చింతపల్లిలో ఈ ఎంఆర్ఎస్ పాఠశాలను ఏకకాలంలో ప్రారంభిస్తారని చెప్పారు. అంతర్గత రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. లకే పుట్టు గ్రామంలో ఎం.పి.పి పాఠశాల శిథిలావస్థలో వుందని, కొత్తగా నిర్మించాలని గ్రామస్తుల కోరగా పీవో సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వీఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె. వేణుగోపాల్, ఏఈ అభిషేక్, ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ఆఫ్ ఇండియా సంస్థ డీజీఎం డి.విశ్వనాథరావు, ఏజీఎం రవీంద్రనాథ్, సత్యనారాయణ, గురుకులం కోఆర్డినేటర్ మూర్తి పాల్గొన్నారు.



మరమ్మతు చేయిస్తున్న సర్పంచ్

సిపిఎం సర్పంచ్ మొస్య చొరవతో మరమ్మతు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని టోకురు పంచాయతీ తెంతలిగుడ, బోడగూడ గ్రామాలలో బోరు మోటారు, సోలార్ ప్లాంటేషన్ కనెక్షన్లను పంచాయతీ సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య గురువారం మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఉన్న తాగునీటి పథకాలు మరమ్మతుకు గురైనట్లు తమ దృష్టికి గ్రామస్తులు తీసుకోవచ్చారని, వెంటనే స్పందించి మరమ్మత్తు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. తెంతలగూడ బోరు మోటార్ కలెక్షన్ పూర్తిగా పాడైందని కొత్త కనెక్షన్ ఏర్పాటు చేస్తామని, బోడగుడ గ్రామంలో సోలార్ ప్లాంటేషన్ డ్రై సెట్ మరమ్మతు చేపట్టి తాగునీటి సరఫరా అందించేందుకు చర్యాలు తీసుకుంటామని ఆయన తెలిపారు, పంచాయతీ పరిధి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తిన వెంటనే తమ దష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సార, దొన్ను పంచాయతీ సెక్రెటరీ, లావణ్య వెలిపెర్ అసిస్టెంట్ పి, త్రినాథ్ టిడిపి నాయకులు క, కష్ణ, కె సందరరావు గ్రామస్తులు తత్తరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల్లో నాణ్యత కరువు

- పర్యవేక్షించని అధికారులు
- పైపులు లీకై వృథాగా పోతున్న తాగునీరు
- వీధులన్నీ బురదమయం

ప్రజాశక్తి-ఎటపాక

గ్రామాల్లో ప్రజలకు ఇంటింటికి తాగునీరు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్ల రూపాయలతో చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనుల్లో నాణ్యత కొరవడింది. కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేసి జేబులు నింపుకున్నారు. దీంతో ఎక్కడికక్కడ పైపులైన్లు లీకై తాగునీరు వృథాగా పోతున్న దృశ్యాలు అనేక గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి.

ఎటపాక మండలం నందిగామలో ఏడాది క్రితం జల్ జీవన్ మిషన్ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా వీధుల్లో వేసిన పైపులైన్ల పనుల్లో ఎక్కడా నాణ్యత కనిపించడం లేదు. ఈ పనులు జరుగుతున్న సమయంలో వీటికి ఉపయోగించే పైపులు, ఇతర మెరిటీయల్ నాణ్యమైనవి ఉపయోగిస్తున్నారా? లేదా? అనేది అధికారులు పర్యవేక్షించాలి. కాని నందిగామలో అధికారులు ఆ పని చేయకపోవడంతో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా నాసిరకం మెటీరియల్‌తో తాగునీటి పైపులైన్లు వేశారు. దీంతో ఇప్పుడు ఆ పైపులు పలు చోట్ల లీకై తాగునీరంతా వృథాగా పోతుంది. పైపులైన్ నుండి నీరు లీకైపోవడంతో ఇళ్లలోకి నీరు రావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు పైపులైన్ల నుండి లీకైన నీటి వల్ల గ్రామంలో వీధులన్నీ బురదమయంగా మారాయి. అసలే మట్టి రోడ్డులు కావడంతో వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంది. లక్షల రూపాయలు వెచ్చించి చేపట్టిన పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రజాధనం వృథా అయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.



పైపులైన్లు లీకు కావడంతో బురదమయమైన వీధి రోడ్డు




పైపులైన్ లీకై నీరు వస్తున్న దృశ్యం

రేగులపాడులో విద్యుత్ సమస్యపై వినతి

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని రేగులపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని భీమవరం విద్యుత్ కార్యాలయంలో లైన్‌మెన్‌కు రేగులపాడు పంచాయతీ సర్పంచ్ బొగ్గా రామారావు, స్థానిక ఎంపిటిసి, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య ఆధ్వర్యాన గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, వైస్ ఎంపిపి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, దీనిపై విద్యుత్‌శాఖ అధికారికి చెప్పినా స్పందించలేదని పేర్కొన్నారు. ఇటీవల వరదల సమయంలో పడవలు పట్టుకొని పోయిమరి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్‌శాఖ సిబ్బంది ఇప్పుడు ఎక్కడ నిద్రపోతున్నారని ప్రశ్నించారు. ఈ సమస్య ఎప్పుడి నుండో ఉందన్నారు. మొన్నటి వరదలకు రేగులపాడు గ్రామం దారిదాపులకు కూడా వరదనీరు రాలేదని, అయినా కరెంట్ లేకుండా 3 వారాల పాటు చీకటిలో ఉండవలసి వచ్చిందని పేర్కొన్నారు. రేగులపాడు పంచాయతీకి విద్యుత్ సరఫరా చేసే బాధ్యత విద్యుత్‌శాఖ సిబ్బందికి కాదా? అని ప్రశ్నించారు. దీనిపై కూనవరం మండలంలోని సబ్ స్టేషన్‌కి వెళ్లి మండలం లైన్ మెన్‌ను నిలదీశారు. బుధవారం విద్యుత్ సరఫరా ఆగిపోయినా లైన్‌మెన్‌కు తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనికి స్పందించిన లైన్‌మెన్ సాయంత్రం లోపు విద్యుత్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పెద ఆర్యూర్ సర్పంచ్ మడకం నాగమణి, ఎంపిటీసీలు ధర్మల అమ్మాజీ, కారం జయసుధ, మండల కమిటీ సభ్యులు తాల్లూరి శ్రీను, ఈశ్వరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్, వైస్ఎంపిపి, సిపిఎం నాయకులు



అవగాహన కల్పిస్తున్న మండల కో ఆర్డినేటర్ రవి

యువతకు డిజిటల్ నాలెడ్జిపై శిక్షణ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ :గిరి యువతకు నేచర్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో అరకులోయ మండలం పద్మాపురం పంచాయతీ బెద్దగూడలో నేచర్ ట్రైబల్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం దుంబ్రిగుడ, అరకులోయ మండలాలకు చెందిన యువతకు సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ బాలరాజు ఆదేశాల మేరకు యువతకు డిజిటల్ నాలెడ్జి, ప్రభుత్వ పథకాలు, రాయితీ, చట్టాలు, హక్కులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ రవి మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ యాప్ ల ద్వారా డిజిటల్ నాలెడ్జిపై కల్పించాలని అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో యూత్ సభ్యులకు కంప్యూటర్ నాలెడ్జి, లైఫ్ స్కిల్స్, డిగ్రీ, పీజీ, చదువుకునే యువతి, యువకులకు ఉద్యోగ తోడ్పాటును సంస్థ అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శంకర్ నాయక్ మాట్లాడుతూ, గిరి యువతి యువకులకు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గ్రామసభలో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సింహాచలం, కస్తూరి కావ్య, హరి, కృష్ణ, శివ, అజయ్, శాంతి, శైలజ, కొండప్ప, రాంబాబు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్ఐకి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-హుకుంపేట:ముంచంగిపుట్టు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన పాంగి చిన్నయ్య కు గురువారం మఠం పంచాయతీ జాకరవలస గ్రామం లో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, పోలీసులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఎస్ఐ సతీష్, రవీంద్ర ఏఎస్ఐ మృత దేహానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ తరుపున కొంత ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఏఎస్ఐ విధుల పట్ల అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. పలువురు నాయకులు, ఉద్యోగులు ఘనంగా నివాళి అర్పించారు.

వినాయక ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో పోర్టల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వినాయక చవితి ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో పోర్టల్‌ను విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఉత్సవాలకు అనుమతులు పొందవచ్చునని తెలిపారు. శుక్రవారం నుంచి ఈ యాప్ అందుబాటులోకి వస్తుందని, ఈ యాప్‌లో ఉత్సవాలకు సంబంధించి వివరాలు పెట్టిన తర్వాత అన్ని విభాగాల అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. వినాయక ఉత్సవాల భద్రత విషయంలో రాజీ పడే సమస్య లేదని, చట్టపక్షంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు.

హనీ ట్రాప్ వ్యవహారంలో స్పీడ్ పెంచిన ఎన్ఐఎ

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో : నేవీ అధికారుల హనీ ట్రాప్ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) స్పీడును పెంచింది. ఆ మేరకు గురువారం విశాఖలో పలు చోట్ల ఎన్ఐఎ అధికారులు తనిఖీలు చేశారు. 2021వ సంవత్సరంలో కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నమోదు చేసిన కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఆనాడు ఏడు రాష్ట్రాల్లో 16 ప్రాంతాల్లో విస్తృత తనిఖీల్లో భాగంగా విశాఖలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా తనిఖీలు చేపట్టారు. భారత రక్షణ శాఖ సమాచారాన్ని పాకిస్తాన్ ఐఎస్ఐకి చెందిన అనుమానితుల లక్ష్యంగా తనిఖీలు జరిపారు. ఐఎస్ఐ నుంచి డబ్బులు అందుకున్న వారిపై కూడా ఎన్ఐఏ నిఘా పెట్టింది. రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంతో పాటు గుజరాత్, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఉత్తరాది చెందిన 16 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. ఈ సోదాలలో 22 సెల్ ఫోన్‌లు కీలక పత్రాలు లభించాయని తెలుస్తోంది.

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు



అరకులో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయ :అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ చలపతిరావు, డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ పుష్పరాజుల ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించి తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ, పండితులు మాత్రమే మాట్లాడే గ్రాంధికంలో ఉన్న తెలుగు భాషను వ్యవహారిక భాషలోకి గిడుగు రామ్మూర్తి పంతులు సామాన్యులు మాట్లాడే విధంగా ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రోజా రాణి, కే బాలరాజు, దివ్య, మౌనిక, బలరాం, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంపై ఆసక్తి చూపించి జాతీయస్థాయిలో గుర్తింపుతో పాటు పతకాలు సాధించాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య, ఎంపీపీ కోరాబు అనూష దేవి ఆకాంక్షించారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ ఎం విజయభారతి ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బాలయ్య, అనూష దేవిలు మాట్లాడుతూ, ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు భారతదేశం తరపున ఇతర దేశాలలో పాల్గొని విజేతలుగా నిలిచారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి మాట్లాడుతూ, ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకుంటు న్నామన్నారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు బహుకరించారు. కళాశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు లీలాపావని, జగదీష్, ఈశ్వర్, జగత్ రాయ్, ఎంపిటిసి సభ్యురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

రాజవొమ్మంగి:మండలంలోని బోర్నగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా పండితులు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిఏవి



చింతపల్లిలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఎంపిపి

పాఠశాలలో గురువారం తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను పురస్కరించుకొని పలు కార్యక్రమాలు నిర్వహించారు. డిఏవి పాఠశాలలో విద్యార్థి అల్లూరి సీతారామరాజు వేషధారణలో ఆకట్టుకున్నారు. జూనియర్ కళాశాలలో వాడుకభాషకు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు గురించి ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో కమలాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, పద్య పఠనం పోటీలు నిర్వహించి, విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖధిపతి కె.శ్రీదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్, అధ్యాపకులు వై.పద్మ, ఆర్‌సిహెచ్. నాగేశ్వరరావు, కె.శకుంతల, కె.శైలజ, ఎస్.అప్పనమ్మ, కె. శ్రీలక్ష్మి, సిహెచ్.రాజాబాబు, ఆర్.మౌనిక, జి.సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హాస్టళ్ల సమస్యలపై రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ గిరిజన, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పాడేరు ఐటిడిఎ వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రాజుబాబు, అమర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫణింద్ర కుమార్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్స్ ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. హాస్టల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ సిబ్బందిని నియమించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు వి. కృష్ణారావు, పి.చినబాబు, మంజుల, శిరీష, తనీష్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రఖ్యాత ఐటి పరిశ్రమలను ఏపీకి రప్పిస్తాం

మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో : మెరుగైన ఐటి పాలసీని ప్రకటించి, దేశంలోనే ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ఐటి అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ గురువారం ముఖాముఖి సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ఐటి రంగంలో ఇప్పటికే అభివృద్ధి సాధించిన హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్‌లల్లో అమలుచేస్తున్న పాలసీలను అధ్యయనం చేసి మెరుగైన ఐటి పాలసీని తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్రంలో అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలు కీలకపాత్ర పోషించబోతున్నాయని వివరించారు. దేశంలో టాప్ - 10 ఐటి కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని, త్వరలో రాష్ట్ర ప్రజానీకం ఐటి పరిశ్రమ పెట్టుబడులపై శుభవార్త వింటారని తెలిపారు. ఐఎస్‌బి తరహాలో విశాఖలో ప్రపంచస్థాయి ఎఐ యూనివర్సిటీని ఏర్పాటుచేస్తామని, ఎఐ హబ్‌గా కూడా విశాఖను తీర్చిదిద్దుతామని, రోబోటిక్స్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ వంటి రంగాలతో అనుసంధానించి ఐటిని వేగవంతంగా అభివృద్ధిచేస్తామని చెప్పారు. రాబోయే అయిదేళ్లలో విశాఖపట్నాన్ని 100 బిలియన్ డాలర్ల ఎకానమీ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపర్చాలి

- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో వ్యాధుల తీవ్రతను పరిగణనలోకి తీసుకొని ఆరోగ్య అత్యవసర సేవల కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపర్చాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు సరిగా లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. వ్యాధుల తీవ్రతను బట్టి వైద్య పరీక్షలు, మందులు, మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఉండడంతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, వ్యాధులు పెరగకుండా గ్రామీణ, పట్టణాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని కోరారు.

పెరుగుతున్న జ్వరాలు, మలేరియా, టైపాయిడ్, డెంగీ తదితర వ్యాధులు నియంత్రణకు అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ప్రైవేట్ ఆసుపత్రులకు పేదలు వెళ్లకుండా తగిన వైద్య సదుపాయాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కల్పించాలని, ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో ఆగస్టు చివరికి మలేరియా 195, జ్వరాలు 12వేలకు పైగా నమోదు అయ్యాయని, ఈ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని వైద్య సేవలు విస్తృత పర్చాలని కోరారు. వ్యాధులు ఎక్కువ ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

తుపానుపై అప్రమత్తం

- జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : తుపాను కారణంగా భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో నగర ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ పలు విభాగాధిపతులను అప్రమత్తం చేస్తు ఉత్తర్వులు జారీచేశారు. నగరంలో ప్రస్తుతం భారీ వర్షాలు పడుతున్నందున జివిఎంసి అడిషనల్ కమిషనర్-1 పర్యవేక్షణలో కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌లో 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగాధిపతులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, నిరంతరం తాగునీటికి అంతరాయం లేకుండా చూడాలని, ఓవర్ హెడ్ ట్యాంకులు, సర్వీస్ రిజర్వాయర్లలో గరిష్ట స్థాయిలో నీటి నిలువలు ఉంచుకోవాలని, నీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేయడం, గెడ్డలు, కాలువలలో వ్యర్థాలు నిల్వ లేకుండా చూడాలని, మ్యాన్ హోల్‌పై మూతలు సరిచేయాలని ఆదేశించారు. ప్రజారోగ్యవిభాగాధికారులు కాలువలు శుభ్రం చేసేందుకు తగిన పనిముట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. కాలువలు, గెడ్డలు, కల్వర్టులలో వ్యర్థాల తొలగింపు, ఎఎమ్ంహెచ్‌లు 24 గంటలు పారిశుధ్య సిబ్బంది విధులను పర్యవేక్షించాలని, అంటూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. నగర ప్రజలు సహాయక చర్యల కోసం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో గురువారం నుంచి శనివారం వరకు 24 గంటలు కంట్రోల్ రూము పనిచేస్తుందని పేర్కొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సత్యనారాయణదొర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని దోనెలపాలెం, గింజర్తి, ఎర్రంపాడు తదితర గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలలను ఎంఈఓ కె సత్యనారాయణ దొర గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తొలిత పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏ విధంగా అందుతున్నది, మెనూ సక్రమంగా అమలు చేస్తున్నదీ లేనిది ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సెల్ఫ్ అసైన్మెంట్ పరీక్షను పర్యవేక్షించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సూరారెడ్డి, సీఆర్పీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు :చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్న మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్, జువాలజీ, హిస్టరీ అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సంబంధిత విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులు పొందిన వారు దీనికి అర్హులని పేర్కొన్నారు. పీహెచ్.డి, నేషనల్ లెవెల్ ఎలిజిబులిటీ టెస్ట్, స్టేట్ లెవెల్ ఎలిజిబులిటీ టెస్ట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. అర్హతలు కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబర్ 6వ తేదీన ఇంటర్వ్యూ, డెమో క్లాస్ నిర్వహిస్తాంమని పేర్కొన్నారు. వివరాలకు చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

14న లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : వచ్చేనెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధిఆకర సంస్థ అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా కోర్టులోని నూతన భవన సముదాయంలోని సమావేశమందిరంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ న్యాయవాదులు, పోలీసులు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులతో జాతీయ లోక్‌అదాలత్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు లోక్‌అదాలత్ విజయవంతానికి తగు సూచనలు చేశారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి కె.రాధా రత్నం, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ, డిసిపి క్రైమ్ లతా మాధురి పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఒప్పందాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక :విద్యుత్తు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సిపిఐ గాజువాక శాఖ కార్యదర్శి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు డిమాండ్ చేశారు. గురువారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో మీటర్ రీడర్ల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు ఒప్పందానికి ఓకే అంటే, ప్రస్తుతం టిడిపి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమన్నారు. విపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని అంగీకరించబోమని వెల్లడించిన సిఎం చంద్రబాబు, ఇపుడు అధికారంలోకి వచ్చాక మాటమార్చడం సరికాదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తుంటే, ఇక్కడ దాన్ని అమలు చేయడం సరికాదన్నారు.

సిఆర్‌టిలందరికీ ఉద్యోగాలు కల్పించాలి

గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి :రంపచోడవరం నియోజకవర్గంలోని పలు గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేసిన సిఆర్‌టిలందరికీ ఉద్యోగాలు కల్పించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఆమె భర్త మఠం విజయభాస్కర్ గురువారం అమరావతిలో గిరిజన సంక్షేమ కమిషనర్‌ను కలిసి విన్నవించారు. ఏజెన్సీలోని పాఠశాలల్లో గతంలో పనిచేసిన సిఆర్‌టిల్లో కొంతమందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని, ఎప్పటినుండో చేస్తున్న మిగిలిన సిఆర్టిలను వెళ్లిపోమంటే వారి కుటుంబాలతో రోడ్డున పడతారని పేర్కొన్నారు. అందరు సిఆర్టిలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే శిరీష దేవి తెలిపారు.



గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌తో ఎమ్మెల్యే శిరీషాదేవి

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : :ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచితంగా మందులు అందించాలని కోరారు. వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలన్నారు. ఈ పిహెచ్‌సిలో ఎంతమంది వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నది, ప్రతిరోజు ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నదీ ఆరా తీశారు. పిహెచ్‌సి చుట్టుపక్కల ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, పిహెచ్‌సిలో రాత్రి సమయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం 39వ జాతీయ నేత్రదాన కార్యక్రమంలో పిఒ సింహాచలం పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సుజిత, కృష్ణ పవర్, శ్యాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయులో క్లీనికల్ ఎంబ్రియాలజీ కోర్సు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాలలో నూతనంగా నిర్వహిస్తున్న మాస్టర్స్ ఇన్ క్లీనికల్ ఎంబ్రియాలజీ కోర్సును వర్సిటీ విసి ఆచార్య జి.శశిభూషణరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎంబ్రియాలజీ నిపుణుల అవసరం పెరుగుతోందన్నారు. సమాజ అవసరాలు, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రాధాన్యత కలిగిన ఇటువంటి కోర్సును ప్రారంభించడం పట్ల కళాశాల ఆచార్యులను విసి అభినందించారు.
లైఫ్ ఫెర్టిలిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్‌తో, ప్రత్యక్ష శిక్షణతో కూడిన ఈ కోర్సులను ఏయూ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఏడాది కాల వ్యవధి కలిగిన పిజి డిప్లమా కోర్సును సైతం నిర్వహిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్ మాట్లాడుతూ కళాశాల నుంచి తక్షణ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ సమాజానికి అవసరమైన నిపుణులను అందించే విధంగా కోర్సు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విసి ఆచార్య శశిభూషణరావు

ఎయును సందర్శించిన సైనికాధికారి

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్ ప్రతినిధి కెప్టెన్ సందీప్‌దాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎయు వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్‌లో మొరాయించిన లారీ

భారీగా నిలిచిపోయిన వాహనాలు

రాకపోకలకు తీవ్ర అంతరాయం



ఘాట్‌రోడ్డులో నిలిచిపోయిన లారీ

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతురు మండలం మారేడుమిల్లి ఘాట్ రోడ్డులోని వన దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం లోడ్ వచ్చిన లారీ ఆగిపోవడంతో ఈ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చింతూరు- మారేడుమిల్లి మధ్యలో ఉన్న ఘాట్ రోడ్డు పూర్తిగా పడిపోయింది. ఆంధ్రప్రదేశ్, చతీస్‌ఘడ్, ఒడిశా, తెలంగాణ నాలుగు రాష్ట్రాలకు నిత్యావసర సరుకులు సరఫరాకు, మారేడుమిల్లి మండలంలోని గుడిస అందాలు చూడటానికి వచ్చే టూరిస్టులకు ఇదే ప్రధాన రహదారి. ఈ మార్గంలో లోడ్‌తో వచ్చిన లారీ ఘాట్‌రోడ్డు ఎక్కే క్రమంలో మొరాయించి రోడ్డుకు అడ్డంగా ఆగిపోయింది. దీంతో ఈ మార్గంలో ఇరువైపులా కారులు, బస్సులు, ఇతర వాహనాలు కిలోమీటరు మేరకు నిలిచిపోయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

డెంగీ కేసు నమోదుతో అప్రమత్తం



తామరపల్లిలో వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ సుజిత

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని తామరపల్లి గ్రామంలో డెంగీ కేసు నమోదైంది. దీంతో నరసాపురం ఆసుపత్రి వైద్య అధికారి డాక్టర్ సుజిత ఆధ్వర్యంలో గురువాకరం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సందర్శించిన ముసురుమిల్లి ఎంపీటీసీ సభ్యులు వంశి కుంజం వైద్యఅధికారితో మాట్లాడారు. పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో జ్వరాలతో పలువురు బాధపడుతున్నారని, ఆయా గ్రామాల్లోనూ వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. అనంతరం వైద్యాధికారి సుజిత మాట్లాడుతూ కాచిచల్లార్చిన నీటిని తాగాలని, దోమ తెరలు తప్పకుండా వాడాలని, ఏదైనా ఆరోగ్య సమస్యలొస్తే ఆశ కార్యకర్తలకు తెలపాలిని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచో అన్నపూర్ణ, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సతీష్, ఎంఎల్‌హెచ్ పి బుల్లియమ్మ, ఆశ కార్యకర్తలు సావిత్రి, రాములమ్మ, శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని తొమ్మిదో వార్డ్ మెంబర్ నల్లమిల్లి సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు బెడద ఎక్కువైందని, చాలామంది టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో ఆసుపత్రిల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలను, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.



సుందర ప్రదేశం.. అరకు

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

44వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

పాడేరు డివిజన్ | శుక్రవారం 30-08-2024 | 8 పేజీలు

పటిష్ట ప్రణాళికలతో.. అభివృద్ధి అడుగులు

- అల్లూరి జిల్లా గతం కంటే పలు రంగాల్లో మెరుగు
- పర్యాటకంతో ఆదాయం భేష్
- రోడ్డు, రవాణా, విద్యా, వైద్య సౌకర్యాల మెరుగునకు ప్రయత్నాలు

ప్రజాశక్తి - అల్లూరి డెస్క్

పర్యాటకం అంటేనే ఠక్కున గుర్తుకొచ్చే జిల్లా.. అల్లూరి. ప్రకృతి అందాలకు, సహజ సోయగాలకు ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. పూర్తి ఆదివాసీ జిల్లా. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద జిల్లా. సమగ్ర ప్రణాళికలతో ఈ జిల్లా నేడు అభివృద్ధి అడుగులు వేస్తోంది. మునుపటికంటే రోడ్డు, రవాణా సదుపాయాలు, వైద్య సౌకర్యాలూ మెరుగయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో ఇలానే ముందుకెళ్తే ఉత్తమ ఫలితాలను ఈ జిల్లా సాధిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి విడివడి అల్లూరి సీతారామరాజు జిల్లాగా 2022లో ఏర్పడ్డ పాడేరు మన్యం అటు రంపచోడవరం డివిజన్‌ను కలుపుకుని విస్తీర్ణంలో రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రాంతంగా ఆవిర్భవించింది. కొత్త జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ముఖచిత్రం మారింది. అధికారులు, కార్యాలయాల సంఖ్య పెరగడం, పథకాల పర్యవేక్షణకు వీలుపడటం, కొద్దిగా రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో గతంతో పోలిస్తే నూతన అల్లూరి జిల్లా అభివృద్ధిలో కాస్త మెరుగైంది. పర్యాటకం అభివృద్ధికి వీలు కలిగింది. వైద్య సదుపాయాలకు కొద్దికాలంగా పెద్దపీట వేస్తున్నారు. పాడేరు, అరకు ఆసుపత్రుల్లో వైద్యుల నియామకం, వైద్య పరికరాల కొనుగోలు వంటి పనులు చకచకా జరిగాయి. పాడేరు మెడికల్ కాలేజీకి కూడా ఓ రూపం వచ్చింది. మరోపక్క రవాణాను సులభతరం చేసేందుకు ఏజెన్సీలో పలుచోట్ల జాతీయ రహదారులకు మోక్షం కలిగింది.

అల్లూరి జిల్లాలో 2022 ఏప్రిల్ 4 నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. ఈ జిల్లా భౌగోళిక విస్తీర్ణం :12,253 చదరపు కిలోమీటర్లు, రెవెన్యూ డివిజన్లు : పాడేరు, రంపచోడవరం, మండలాలు : 22, రెవెన్యూ గ్రామాలు : 2972, గ్రామ పంచాయతీలు : 430, గ్రామాలు : 4340, గ్రామ సచివాలయాలు : 352, పార్లమెంట్ : అరకు, అసెంబ్లీ నియోజకవర్గాలు : అరకు, పాడేరు, రంపచోడవరం, 2011 ప్రకారం జనాభా : 9.54 లక్షలు. తూర్పు కనుమల్లో ఆహ్లాదకరమైన ప్రకృతి అందం అరకులోయ, పాడేరు సొంతం. సముద్రమట్టానికి 3100 అడుగుల ఎత్తున గల అరకులోయ ఆంధ్రా ఊటీగా పేరొందింది. ఎన్నో ప్రకృతి అందాలు, జలపాతాలు జిల్లాలో కొలువుదీరాయి. వాటి ప్రత్యేకతలనూ, జిల్లా ముఖచిత్రాన్ని తెలుపుతూ సాగేదే ఈ ప్రత్యేక అనుబంధం.



పురాతన శైవ క్షేత్రం మత్స్యగుండం

- మన్యవాసుల విశ్వాసాన్ని చూరగొంటున్న ఆలయం
- ఆదరణ బాగున్నా.. కానరాని అభివృద్ధి


మత్స్య కన్య


మత్స్య గుండంలో దర్శనమిస్తున్న మత్స్యాలు

ప్రజాశక్తి-హుకుంపేట

పురాతన శైవ క్షేత్రం మత్స్యగుండం. ఈ ఆలయం పర్యాటక కేంద్రంగా కూడా రూపుదిద్దుకుంది. ఇక్కడ మత్స్యలింగేశ్వరస్వామి కొలువై అందరి కోర్కెలు తీరుస్తాడని భక్తులు నమ్ముతారు. ప్రతియేటా ఇక్కడ శివరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు మన్యం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్ర రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి, అటు ఒడిశా నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ మూడు రోజుల పాటుగా ఐటిడిఎ ఆధ్వర్యాన ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఇదీ ఆలయం కథ..

ఈ ఆలయానికి సంబంధించి ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం జి.మాడుగుల మండలంలోని మత్స్య పర్వతం వద్ద సింగరాజులు (పాములు), మత్స్యగెడ్డలో మత్స్యరాజులు (చేపలు) నివసించేవి. ఒకానొక సందర్భంలో మత్స్యరాజులకు, సింగరాజులకు యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో విజయం సాధించిన మత్స్యరాజులు, మత్స్యగుండం వద్ద స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ చేపలే ప్రస్తుతం మత్స్యాలుగా భక్తులకు దర్శనం ఇస్తున్నాయని చెబుతారు. ఇక్కడ కొలువైయున్న మత్స్యలింగేశ్వరస్వామి భక్తుల కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా కొలుస్తున్నారు. ప్రస్తుత మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న శివలింగాన్ని కోరిక కోరి పైకి ఎత్తితే ఆ కోరిక తీరుతుందని భక్తులు నమ్ముతారు. ఇక్కడ దర్శనమిచ్చే మత్స్యాలు (చేపలు)ను స్థానికులు దైవ సమానంగా భావిస్తారు. వీటి దర్శనం కలిగితే ఎంతో అదృష్టమని చెబుతుంటారు. వీటి దర్శనభాగ్యం కోసం భక్తులు మరమరాలు, కొబ్బరి ముక్కలను నీటిలో వేస్తుంటారు. వాటిని తినేందుకు వచ్చే మత్స్యాలను భక్తులు దర్శించుకొని తరిస్తారు. అలాగే ఆలయ సమీపంలో నాగేంద్రుడి ఆలయం ఉంది. ఈ నాగేంద్రుడిని కొలుస్తే పిల్లలు లేనివారికి సంతానం కలుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం.


అభివృద్ధికి నోచని ఆలయం

1964లో నాటి పాడేరు తహశీల్దార్ కుసర్లపాటి సత్యనారాయణ దంపతులు, ఆ గ్రామస్తులు మఠం సన్యాసినాయుడు, చిన్నరామునాయుడుల సహకారంలో ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ వస్తుంది. ప్రస్తుతం ఆలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి అక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. మత్స్యగుండం ఆలయం ఎంతో విశాలంగా ప్రశాంతంగా ఉంటుంది. పర్యాటకులకు ఇక్కడి వాతావరణం చక్కని అనుభూతిని మిగులుస్తుంది. ప్రతి ఏడాది శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతారు. విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తూ రంగులతో మెరిసిపోతూ ఉంటుంది. శివరాత్రి ముగిసిపోగానే నిర్లక్ష్యానికి గురై ఎప్పటి మాదరిగానే దర్శనమిస్తుంది. ప్రతి ఏడాది శివరాత్రి మహోత్సవాల నిర్వహించేటప్పుడే ఆలయ పరిసరాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు తప్ప మిగిలిన రోజుల్లో పట్టించుకోవడం లేదనే చెప్పాలి. దీంతో పార్కులో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుతున్నాయి. నిత్యం ఇక్కడ పర్యటకులు, భక్తులు వచ్చేలా అని రకాల సౌకర్యాలు, గార్డెన్, చుట్టుపక్కల అందమైన పూల మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బోటు షికారుకు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇటువంటి పురాతన శివాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. దీన్ని మరింత అభివృద్ధి పరిస్తే పర్యాటకులకు చక్కని ప్రదేశాన్ని అందించినవారవుతాం. ఐటిడిఎ అధికారులు నిధులు కేటాయించి ఆలయాన్ని అభివృద్ధి చేస్తే మరింత ఆదాయం కూడా వస్తుందని స్థానికులు అంటున్నారు.


శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా మత్స్య దర్శనానికి వచ్చిన భక్తులు

పర్యాటక సిరి.. అల్లూరి

ఏడాదంతా టూరిస్టుల సందడి



బొర్రా గుహల వద్ద సందర్శకులు

ప్రజాశక్తి - పాడేరు / పాడేరు టౌన్ / డుంబ్రిగుడ విలేకరులు

ఎటుచూసినా ఎత్తయిన కొండలు.. పచ్చదనం పరచుకున్న లోయలు, జాలువారే జలపాతాలు, పాల కడలిని తలపించేలా పొగమంచు. ఏ దిక్కుకెళ్లినా.. ఎన్నో రకాల వృక్ష జాతులు, జంతు, జీవజాలాలు. భూతల స్వర్గంగా ఈ ప్రాంతముంటుందంటే అతిశయోక్తి కాదు. అంతలా పేరుగాంచింది అల్లూరి సీతారామరాజు జిల్లా మన్య ప్రాంతం. పర్యాటక రంగం పేరు చెబితే ఈ జిల్లానే ఠక్కున గుర్తుకొస్తుంది. కృత్రిమ అందాలకు ఇక్కడ తావుండదు. సహజసిద్ధ ప్రకృతి అందాలకు ఈ ప్రాంతం నిలయం. పర్యాటకుల మదిని దోచుకుంటున్న ఆంధ్రా ఊటీ అరకులోయ, ఆంధ్ర కశ్మీర్ లంబసింగితో పాటు అంతకుమించిన అందాలు మన్యంలో మరెన్నో ఉన్నాయి.

ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన బొర్రా గృహలు అనంతగిరి మండలంలో ఉన్నాయి. విశాఖపట్నం నుండి రైలులో ప్రయాణించే క్రమంలో కొండ గుహల నుండి రైలు వెళ్తూ ఉంటూ ఎంతో అనుభూతి పొందుతారు. అరకులోయలో గిరిజన ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలను ప్రతిబింబించే గిరిజన మ్యూజియం ఉంది. మ్యూజియం ఆవరణలో బోటింగ్ చేయవచ్చు. ఇక్కడకు సమీపంలోనే కాఫీ మ్యూజియం ఉంది. అందులో వివిధ రకాల కాఫీ రుచులను ఆస్వాదించవచ్చు. పద్మాపురం ఉద్యాన వనంలో భిన్న రకాల పూల మొక్కలు స్వాగతం పలుకుతాయి. అరకులోయలో రాత్రికి బస చేయొచ్చు. మరుసటి రోజు అరకులోయ నుంచి పాడేరు వెళ్లే మార్గంలో అరకుకు 16 కిలోమీటర్ల దూరంలో డుంబ్రిగుడ వద్ద చాపరాయి జలపాతం ఉంది. సొంత వాహనాల్లో వెళ్ళవచ్చు. ఆర్‌టిసి, ప్రైవేటు వాహనాలు కూడా ఉన్నాయి. అలాగే డుంబ్రిగుడ మండలంలో అంజోడా సిల్క్ ఫారం, కొల్లాపుట్టు జలతరంగిని పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ నుంచి పాడేరు చేరుకుని, మరుసటి రోజు ఉదయాన్నే ఇప్పటికే ప్రాచుర్యంలోకి వచ్చిన పాడేరుకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న వంజంగి హిల్స్‌ను సందర్శించవచ్చు. పాడేరు మండలం వంజంగి పంచాయతీ కల్లాలబయలు ప్రాంతంలో దట్టమైన మంచుతో పాల సముద్రాన్ని తలపించే వంజంగి హిల్స్ అందాలు ఎంతగానో మైమరపిస్తాయి. పర్యాటకులు ముందు రోజు రాత్రి పాడేరులో బస చేసి వేకువజామునే బయలుదేరి వంజంగి హిల్స్‌కు చేరుకుంటారు. ఇక్కడ ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పాలసముద్రంలా కనిపించే మంచు అందాలను వీక్షించవచ్చు.

అందాల కొత్తపల్లి

పాడేరు నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి చేరుకోవచ్చు. ఈ జలపాతం సందర్శకులను అలరిస్తూ ప్రముఖ పర్యాటక ప్రదేశంగా గుర్తింపు పొందింది. మెట్ల మాదిరిగా ఉండే కొండరాళ్లపై నుంచి జాలువారే జలపాతం ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంటుంది. విశాఖపట్నం నుంచి పాడేరు మీదుగా, నర్సీపట్నం వైపు నుంచి అయితే లంబసింగి, లోతుగెడ్డ జంక్షన్ మీదుగా కొత్తపల్లి చేరుకోవచ్చు. పాడేరు నుంచి ఆర్‌టిసి బస్సులు, ప్రైవేటు వాహనాలు ఉంటాయి. పాడేరు-చింతపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఈ జలపాతం ఉంటుంది. సొంత వాహనాల్లో కూడా వెళ్లొచ్చు.

ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి

ఆంధ్ర కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగి ప్రాంతం అతి



కొత్తపల్లి జలపాతం

శీతలమైంది. ఇక్కడ దట్టంగా కురిసే మంచు అందాలను ఆస్వాదించవచ్చు. విశాఖపట్నం నుంచి వచ్చే పర్యాటకులు నర్సీపట్నం మీదుగా లంబసింగి చేరవచ్చు. పాడేరు నుండి అయితే చింతపల్లి మార్గంలో లోతుగెడ్డ జంక్షన్ మీదుగా ఇక్కడకు చేరుకోవచ్చు. అత్యధిక మంది పర్యాటకులు ముందు రోజు రాత్రి నర్సీపట్నంలో బస చేసి వేకువజామునే బయలుదేరి లంబసింగి వస్తుంటారు. ఇక్కడి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు దట్టంగా మంచు కురుస్తూ ఉంటుంది. శీతాకాలంలో పక్కనున్న (మిగతా 8లో..)

మదినిదోచే గిరి గ్రామదర్శిని

ప్రజాశక్తి- అరకులోయ: పెదలబుడు గ్రామంలో నిర్మించిన గిరి గ్రామదర్శిని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు నిలువుటద్దంగా నిలుస్తోంది. అంతరించి పోతున్న గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి చాటి చెప్పాలన్న సంకల్పంతో పాడేరు ఐటిడిఎ ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. సుమారు రూ.40 లక్షలతో ఇది రూపుదిద్దుకుంది.

అరకులోయను సందర్శించే ప్రముఖులు, పర్యాటకులు గిరి గ్రామదర్శినిని విధిగా దర్శించే వెళ్తారు. సాంప్రదాయబద్ధంగా గిరిజన పెళ్లిళ్లు ఎలా నిర్వహిస్తారో ఇక్కడ చూడొచ్చు. అలాగే తామూ గిరిజన వస్త్రధారణ ధరించి సరదాగా సంప్రదాయ పెళ్లిళ్లు చేసుకుని ఆనందంగా, ఉల్లాసంగా గడిపి మధురానుభూతిని పొందుతారు.

ప్రారంభం ఇలా..

2019లో అరకు వ్యాలీ మండలం పెదలబుడు గ్రామంలో గిరి గ్రామదర్శిని పర్యాటక కేంద్రాన్ని స్థాపించారు. అరకు విచ్చేసే పర్యాటకులకు గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలను ప్రత్యక్ష అనుభూతిగా పొందేలా కార్యక్రమాలను రూపొందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగా, సుమారు 10 గిరిజన సాంప్రదాయ గృహాలను నిర్మించారు. ప్రతి గృహం వేర్వేరు సాంప్రదాయ కార్యకలాపాలను ప్రదర్శించేందుకు ఉద్దేశించబడి ఉంది. పూజా మందిర సందర్శన, బియ్యం కొట్టడం, సామ పిండివేయడం, సామ పిండిగొట్టడం, అడ్డా ఆకు తోలతో పత్రాలు, పాత్రలు తయారు చేయడం, అలాగే సాంప్రదాయ వంటకాలను చూడవచ్చు. గిరి గ్రామదర్శిని సందర్శనలో సాంప్రదాయ వివాహ వేడుక ఒక ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ సాంప్రదాయబద్ధమైన వివాహ వేడుక ఎంతో ఉల్లాసభరితంగా ఉంటుంది. అనేక మంది ప్రముఖులను ఆకర్షించించి మన్ననలు పొందింది. సీనియర్ రాజకీయ నాయకులు, ఐఎఎస్ అధికారులు, భారత సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు కూడా ఈ సాంప్రదాయ గిరిజన వివాహాన్ని జరుపుకొని, వారి పాత రోజులను గుర్తుచేసుకుంటూ ఎంతో అనుభూతి పొందారు.



గిరి గ్రామ దర్శిని

గిరి గ్రామదర్శిని ప్రాజెక్టును అప్పటి ఐటిడిఎ-పాడేరు ప్రాజెక్ట్ ఆఫీసర్ డీకే బాలాజీ మార్గదర్శకాలతో పాటు అరకులోయ మ్యూజియం క్యూరేటర్ మురళీ కృష్ణ పర్యవేక్షణలో పూర్తి చేశారు. పెదలబుడు ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఈ ప్రాజెక్టును సాఫల్యంగా అమలు చేయడంలో భాగస్వాములయ్యారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు ప్రస్తుత పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు భూమిని దానం చేశారు. అంతే కాకుండా ఈ గిరి గ్రామదర్శిని ప్రాజెక్టుకు అత్యంత కృషి చేసి, గిరిజన సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా అవసరమైన సమాచారాన్ని అందించి, ఈ ప్రాజెక్టును ముందుకు నడిపించడంలో ఆయన కీలక పాత్ర వహించారు. గిరి గ్రామదర్శినిలో గిరిజన గ్రామాన్ని తలపించే విధంగా 10 గృహాలు నిర్మించారు.

ఆదివాసీల సాంప్రదాయ వస్త్రధారణ, ఆభరణాలు ధరించుట, సాంప్రదాయ వివాహ వేదిక, ప్రత్యక్ష వంట గృహం, పూజ గృహం, స్త్రీ పురుష వస్త్రధారణ కోసం గృహాలు, వెదురు, అడ్డాకులతో, చేతివృత్తులు తయారు చేయుటకు గృహాలు, ఆహార ధాన్యాలు సిద్ధపరిచే గృహాలు, మట్టి కుండలు తయారు చేయుటకు ప్రత్యేక షెడ్డు, రోస్టర్ కేచింగ్, యారో షూటింగ్, స్థానిక క్రీడల కోసం ప్రత్యేక ప్రాంగణం వంటివి ఇక్కడ నిర్మించారు.అరకులోయ మండల కేంద్రం నుండి ఏడు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన ఈ గిరి గ్రామదర్శిని చూపరులను అమితంగా ఆకట్టుకుంటుంది. అయితే కొన్ని సమస్యలూ దీన్ని వెంటాడుతున్నాయి. గిరి గ్రామదర్శినిలోని గృహాలకు మరమ్మతులు, రిన్నోవేషన్ వంటి అత్యవసరమైన కొన్ని పనులు చేయాల్సి ఉంది. రవాణా సదుపాయాన్ని మెరుగు పరచాల్సి ఉంది. ఈ సదుపాయాలన్నీ కల్పిస్తే గిరి గ్రామ దర్శిని మరింత అభివృద్ధి చెంది పర్యాటకులను ఆకట్టుకుంటుందని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.





సంప్రదాయ వస్త్రధారణలతో మహిళలు

ప్రకృతి సోయగాల సీలేరు



సుందరంగా కనువిందు చేస్తున్న సీలేరు జల విద్యుత్ కేంద్రం

ప్రజాశక్తి -సీలేరు


పచ్చని కొండలు..., జలజల పారే సెలయేరులు.. జాలువారే జలపాతాలు.. మనసును హత్తుకునే కమనీయ దృశ్యాలు సీలేరు సొంతం. సీలేరు ప్రాంత ప్రకృతి సోయగాలు పర్యాటకుల మదిని దోచుకుంటున్నాయి. సీలేరు ప్రాంతంలో కొండల మీద నుంచి కిందికి జాలువారే జలపాతాలు, దట్టమైన అడవులు, ఎత్తైన కొండ కోనల నడుమ ప్రవహించే సీలేరు నది కడు రమణీయంగా ఉంటూ కన్నుల పండుగ చేస్తుంది. కొండ కోనల మీద కనిపించే మంచు దృశ్యాలు కాశ్మీరు, ఊటీలను తలపిస్తాయి.

సీలేరు సమీపంలో ఉన్న ఐస్‌గెడ్డ అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. పక్షులు కిలకిల శబ్దాల నడుమ ఉరకలేసే ఐస్‌గెడ్డ జలపాతం వద్ద పర్యాటకులు సెల్ఫీలు దిగుతూ ఆనందంతో పరవశించిపోతారు. తోటి స్నేహితులకు సెల్ఫీ ఫొటోలు వాట్సాప్‌లో షేర్ చేస్తూ తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు. సీలేరు కాంప్లెక్స్‌లోని పోల్లూరు జలపాతం ఉరకలేస్తూ పర్యాటకుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. దారకొండ ఘాట్ రోడ్‌లో దారాలమ్మ అమ్మవారి సమీపంలో రెండు కొండల నడుమ 365 రోజులు జాలువారే జలపాతాలు సుందర దృశ్యాలు పర్యాటకులతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులను మైమరిపిస్తాయి. పాలనురగలా కనపడే ఈ జలపాతాలు... ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఇక్కడి ప్రకృతి అందాలు పర్యాటకులను ముగ్ధులయ్యేలా చేస్తున్నాయి. అలాగే కొండకోనల నడుమ ఘాట్‌రోడ్డులో ఉన్న దారాలమ్మ ఆమ్మవారి ఆలయం ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మక కేంద్రంగా విరజిల్లుతోంది. ఇక్కడికి పెద్ద సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఒరిస్సా సరిహద్దులోని కొండ ప్రాంతంలో ఉన్న సీలేరు విద్యుత్ కేంద్రం మెయిన్ డ్యాం వద్ద గల జామి తోటలు, సీలేరు ఫిల్టర్ హౌస్ తదితర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్స్‌గా పేరుపొందాయి. కార్తీక మాసంలో సీలేరు ప్రాంత అందాలను తిలకించేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి అనేకమంది టూరిస్టులు బస్సుల్లో తరలివస్తున్నారు. ఇక్కడి సుందర దృశ్యాలను మనసారా తిలకించి ఆస్వాదిస్తారు. పచ్చని చెట్లు, చల్లని వాతావరణం మధ్య సరదాగా టూరిస్టులు గడుపుతుంటారు.

పనిలో పనిగా ప్రముఖ సీలేరు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి ఎనలేని అనుభూతిని పొందుతారు. వందల అడుగుల ఎత్తున ఉండే తూర్పు కనుముల్లో దట్టమైన కీకారణ్యంలో నిర్మించిన ఈ జల విద్యుత్ కేంద్రం ఒక ఇంజనీరింగ్ అద్భుతం. కొండలను తొలిచి కిలో మీటర్ల మేర కృతిమ సొరంగాలు చేసి నీరు దిగువునకు వచ్చేలా ఏర్పాటు చేసి, పెద్దపెద్ద డ్యామ్‌లు వాటికి అనుసంధానంగా చిన్నచిన్న డ్యామ్‌లు ఏర్పాటు చేసి నిర్మించిన ఎగువ సీలేరు.. దిగువ సీలేరు.. మధ్యన డొంకరాయి ప్రాజెక్టుల నిర్మాణం చూపురులను కట్టి పడేస్తుంది. అందువల్లే విద్యార్థులు విహారయాత్రకు ఈ ప్రాంతానికే రావటానికి ఎక్కువగా ఆసక్తి చూపుతారు.

పర్యాటకులు తిరిగి ప్రయాణంలో జీకే వీధి–చింతపల్లి ప్రధాన రహదారి పొడవున ఉన్న కాపీ తోటలు, విరగాసిన కాపీ పండ్లు, మిరియాలు, లవంగాలు, యాలకులు పొదులు వంటి పచ్చని అందాలను తిలకించి అంతులేని అనుభూతిని పొందుతారు. చింతపల్లి నుంచి లంబసింగి వరకు పచ్చటి కొండలు కోనలు అందాలతో పాటు లంబసింగ్ సమీపంలో ఉన్న స్టాబెరి, యాపిల్ తోటల్లో పర్యాటకులు సందడి చేస్తారు. అతి శీతలంగా ఉండే లంబసింగి ప్రాంతానికి వెళితే కాశ్మీర్‌లో ఉన్నామా.. ఊటీలో ఉన్నామా.. అనిపించకు మానదు.

సహసిద్ధమైన ప్రకృతి దశ్య మాలిక అయినా సీలేరుకు మరిన్ని హంగులు సమకూర్చేందుకు, ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందించేందుకు పర్యాటక శాఖ ప్రతిపాదించి సుమారు 20 సంవత్సరాల గడుస్తున్న నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీనిపై పర్యాటక శాఖ దృష్టి సారించి సౌకర్యాలు కల్పిస్తే మంచి టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది.



దారాలమ్మ ఘాట్ రోడ్లో రెండు కొండల నడుమ జాలువారే జలపాతం

కాఫీ మ్యూజియంలో కమ్మని కాఫీ

- చాక్లెట్లు, తినుబండారాలూ లభ్యం- పర్యాటకుల నిత్య సందర్శన

ప్రజాశక్తి- అరకులోయ :అరకులోయ ప్రాంతంలో చూడదగిన ప్రదేశాల్లో కాఫీ మ్యూజియం (కాఫీహౌస్) ఒకటి. గిరిజన మ్యూజియానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కాఫీ మ్యూజియం కాఫీ ప్రియులకు రుచికరమైన కాఫీ అందించడమే కాకుండా విజ్ఞానం, వినోదం పంచి పెడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అరకు వచ్చిన సందర్శకులు కాఫీ మ్యూజియాన్ని చూడకుండా వెళ్లరు. ఇక్కడ తయారయ్యే వివిధ రకాల ఆర్గానిక్ కాఫీలను తాగి పర్యాటకులు మంచి అనుభూతికి లోనవుతుంటారు.



కాఫీ ప్రదర్శనశాల

కాఫీ మ్యూజియంలో కాఫీని తయారు చేసి విక్రయించడమే వారి పని అనుకుంటే పొరపాటే. అరకు కాఫీ మ్యూజియంలో ప్రపంచ కాఫీ చరిత్రలో కాఫీ సంస్కృతి, సాంకేతిక కోణాలలో చారిత్రకంగా మరుగున పడిన పురాణ కథనాలు, కాఫీతో ఆరోగ్యం, సాగు, జీవావరణం, పోషణ మొదలగు ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవచ్చు. అంతే కాకుండా ఇథియోపియా నుంచి అరకు వరకు సాగిన కాఫీ ప్రస్థానాన్ని, గింజల సాగు మొదలుకొని పానీయం తయారీ వరకు జరిగే ప్రయాణాన్ని ఈ కాఫీ ప్రదర్శనశాల తెలియజేస్తోంది. అరకులోయ ఆదివాసీ రైతులు పండించిన కాఫీ గింజలను జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మలచడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందిని ఉత్తేజపరిచే అనేక ఉత్పత్తులు తయారయ్యే తీరును వీక్షించి, కాఫీ పరిమళాలను ఆస్వాదిస్తూ వీటి ఉత్పత్తులను కొనుగోలు చేయడం కాఫీ ప్రియులకు గొప్ప అనుభూతిని మిగిలిస్తోంది.

వివిధ రకాల కాఫీలు

కాఫీ మ్యూజియంలో వివిధ దేశాల కోల్డ్, హాట్ కాఫీలు తయారు చేసి విక్రయించడం ప్రత్యేకత. ఇందులో ఎథినిక్, అతంటిక్, అరేబిక, ఫీబేరి, కాఫీవిత్ ఇంటర్‌కాఫ్ ప్రెసెస్, ఎస్‌ప్రెసో, రెస్ట్రేటో, ఎస్‌పైసో కాన్‌ఫనా, మెకిఅటో, అమెరికెనో, మెక్సికెనో, వియానా, అపెగెటో, కెపిచునో, కెపిమొక, కెపెలెట్టే, గ్రీక్‌పాఫీచునో, ఐరిష్ కాఫీ, కాఫీ కైవాల్యం, కాఫీసోల్ వంటి కాఫీలను ఇక్కడ తయారు చేసి విక్రయిస్తుంటారు. మొదట ఏడు దేశాలతో మొదలైన భారతీయ కాఫీ ప్రస్థానం పలు దేశాలకు భారత్ నుంచి ఎగుమతి అవుతుందని అరకులోయ కాఫీ మ్యూజియం నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేకంగా కాఫీ జర్నీ, విలేజ్

అరకులోయ కాఫీ మ్యూజియంలో కాఫీ జర్నీతో పాటు, కాఫీ విలేజ్‌ను కూడా రూపొందించి నర్సరీ, ప్లాంటింగ్, హార్వెస్టింగ్, ఫల్పింగ్, డ్రాయింగ్, క్యూరింగ్ చేసే విధానం కూడా తయారు చేసి సందర్శకులను ప్రత్యక్షంగా చూపించడం ప్రత్యేకత. ఆర్గానిక్ కాఫీ తయారీ విధానం చూసి వెంటనే తయారు చేయించుకుని కాఫీ తాగుతూ, మరపురాని అనుభూతికి లోనవుతారు.

కాఫీతో ఎన్నో ఉత్పత్తులు..

బొటానికల్ థీమ్ కాఫీ చాక్లెట్, కాఫీ ట్రపుల్స్, లిక్విడ్‌ఫిల్లింగ్ చాక్లెట్స్, చాక్లెట్ కవర్డ్ కాఫీబిన్స్ అండ్ నెట్స్, చాక్లెట్ బార్స్, లాలీపప్స్, చాక్లెట్ పడ్జ, కాకులేట్ బ్రౌనీ, మస్సేన్స్, చాక్లెట్ డొనర్స్, చాక్లెట్ ఫౌంటెన్, చాక్లెట్ డిప్స్, చాక్లెట్ మూజ్, కాఫీ హనీ చాక్లెట్స్, కాఫీ బగ్లర్లు, కాఫీ కేకులు తయారు చేసి విక్రయిస్తున్నారు. సుమారుగా 150 రకాల తిను బండారాలను స్థానిక ఆదివాసీ మహిళలలే ప్రత్యేకంగా శిక్షణ పొంది తయారు చేస్తున్నారు. కాఫీ మ్యూజియంకు వచ్చే పర్యాటకులను మరింతగా ఆకట్టుకొనే విధంగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిభింబించే కళాకృతులతోనే ఫర్నీచర్స్‌ను రూపొందించారు. కాఫీ తోటలో పండే అంతర్ పంటల గింజల విక్రయం, ఐదు రకాల కాఫీ పొడులు కూడా తయారు చేసి సరసమైన ధరలకు విక్రయిస్తున్నారు. వివిధ దేశాల్లో కాఫీ తయారీకి ఉపయోగించే సామగ్రి, కాఫీ ఫిల్టర్, కాఫీ పెర్క్యులేర్, స్టౌవ్‌టాప్, ఎస్‌ప్రెసో, ఫ్రెంచ్ ప్రెస్, టర్కీష్ ఇబ్రిక్ పాట్ వంటి సామగ్రిలు కూడా విక్రయిస్తున్నారు.



కాఫీ కార్నివాల్ డ్యాన్స్

కాఫీ మ్యూజియంలో ఇక్కడకు వచ్చే వారిని వినోద పరిచేందుకు వీలుగా కాఫీ కార్నీవాల్ డ్యాన్స్ (థింసా)ను ప్రదర్శింపజేస్తారు. కాఫీ అనేది కేవలం సేంద్రీయ ఎరువుతో ఉత్పత్తి కాదని గిరిజన సంస్కృతితో ముడిపడివుందని కాఫీ మ్యూజియం నిర్వాహకులు తెలిపారు. కాఫీ ప్రియులను దృష్టిలో పెట్టుకుని కాఫీ టైం స్నాక్స్, సాండ్ విజ్, కుక్కీస్, పేస్ట్రిస్, కేక్స్ తదితర వెరైటీలు తయారు చేసి విక్రయిస్తారు.

హస్తకళల ప్రదర్శన

ఇక్కడ ఆదివాసీ హస్తకళ ప్రదర్శన, విక్రయ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. ఇందులో వెదురు, చెక్క, జనపనార, లక్క, టెర్రకోట్, రాట్, హైరాన్, డ్వాక్రా క్రాఫ్ట్స్, ట్రైబల్ జువెలరీ, సంగీత వాయిద్యాలు సుమారు 200పైగా రకాల హస్త కళలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

పేపర్ కవర్లు

ఈ మ్యూజియంలో పాలథీన్ కవర్లకు చోటు లేదు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కాఫీ మ్యూజియాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏ వస్తువు కొనుగోలు చేసినా పర్యావరణ హితమైన పేపర్లతో తయారు చేసిన కవర్ల (క్యారీ బ్యాగ్)తో వినియోగదారులకు ఇస్తున్నారు. కాఫీ గ్లాసులు కూడా అటువంటివే వాడతారు.

అరకు కాఫీ రుచిచూసిన ప్రధాని

అరకు కాఫీని భారత ప్రధాని నరేంద్ర మోడీ రుచి చూశారు. విశాఖలో జరిగిన ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఆయనకు ఎపి సిఎం చంద్రబాబు అరకు ఆర్గానిక్ కాఫీ విశిష్టతను తెలిపి, కాఫీని తాగించారు. దీనికి ఆయన అరకు కాఫీ ఆమోఘమని ప్రశంసించినట్లు చంద్రబాబు చెప్పారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా కాఫీ సాగుపై అధ్యయనానికి వచ్చిన 11 రాష్ట్రాల ఐఎఎస్‌ల బృందం అరకులోయ కాఫీ మ్యూజియాన్ని ప్రశంసించింది. కాఫీతో తయారు చేసిన వివిధ ఉత్పత్తులు చూసి, ఆర్గానిక్ కాఫీ విశిష్టత తెలుసుకుని, వివిధ రకాల కాఫీ ఉత్పత్తులు విరివిగా కొనుగోలు చేశారు. అరకులోయకు వచ్చే ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, మంత్రులు కాఫీ మ్యూజియాన్ని సందర్శించడం పరిపాటిగా మారింది.



ఆదివాసీల సాంప్రదాయానికి ప్రతీక గిరిజన మ్యూజియం



ప్రజాశక్తి - అరకులోయ: సహజసిద్ధమైన ప్రకృతి అందాలకు నెలవు అరకు. అరకు ఆంధ్రా ఊటీగా ప్రసిద్ధి చెందింది. ఎత్తైన కొండలు, పాతాళాన్ని తాకేలా ఉన్న లోయలు, పచ్చదనాన్ని పరుచుకునే అడవులు, కొండల్ని కప్పేసిన మబ్బుతెరలు, గలగల పారుతూ కొండపై నుంచి జాలువారే జలపాతాలు ఇలా ఒక్కటేమిటి... ఇక్కడ ప్రతి ఒక్కటీ ప్రకృతి, పర్యావరణ ప్రేమికుల మనస్సును దోచే అందాలెన్నో కొలువుదీరి ఉన్నాయి. ఇలా పేరెన్నికగల సహజసిద్ధ సందర్శనా స్థలాలకు తోడు, గిరిజన జీవన వైవిధ్యానికి, సంస్కృతి, ఆచార వ్యవహారాలకు ప్రతిబింబించే కల్పిత అందాలకు కొదవేలేదు. అందులో ప్రముఖంగా చెప్పకోదగినది గిరిజన మ్యూజియం. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న గిరిజన మ్యూజియానికి సంబంధించిన విశేషాలను తెలుసుకుందాం.

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను, తరతరాల వారి జీవన విధానాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేప్పే లక్ష్యంతో 1996లో అరుకులో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. సముద్ర మట్టానికి సుమారు 2500 అడుగుల ఎత్తున ప్రకృతి ఒడిలో ఈ మ్యూజియం ఉంది. ఆదివాసీల సాంస్కృతిక పరిరక్షణ, వాటిని భావితరాలకు, ఇతర ప్రాంతం నుంచి వచ్చే పర్యాటకులకు తెలియ జెప్పడమే ధ్యేయంగా ఆనాటి పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ సోమేష్ కుమార్ అప్పట్లో రూ.13 లక్షలతో దీన్ని నెలకొల్పారు. 1996 ఫిబ్రవరి 23న అప్పటి గవర్నర్ కృష్ణకాంత్ ప్రారంభించారు.


అనాదిగా గిరిజనులు వినియోగించిన, వినియోగిస్తున్న వివిధ రకాల పనిముట్లు, ఉపకరణాలు ఇక్కడ దర్శనమిస్తాయి. దీనిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలోని సవర, జాతాపు, భగత, కొండరెడ్డి, కోందు, వాల్మీకి, మన్నెందొర, మాలి, పూడి తదితర 23 తెగల గిరిజనులు తమ దైనందిన జీవితంలో ఉపయోగిస్తున్న వ్యవసాయ పనిముట్లు, వేటకు ఉపయోగించే వివిధ పరికరాలు, ఉపకరణాలు, సంప్రదాయ నృత్యాల్లో ఉపయోగించే వస్తువులు, గిరి మహిళల ఔన్నత్యాన్ని తెలిపే ఆభరణాలు తదితర ఎన్నో వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. ఆదిమజాతి, ఇతర తెగలకు సంబంధించిన విశేషాలెన్నో ఇక్కడ కొలువుదీరాయి.

తొలి గిరిజన సంస్కృతి ప్రదర్శనశాల

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గిరిజన సంస్కృతి ప్రదర్శనశాల ఇదే మొదటిది కావడం విశేషం. విశాఖపట్నానికి చెందిన చిత్రకారుడు వెంకట్ ఈ మ్యూజియం డిజైనింగ్, అంతర్విభాగాల రూపకల్పన చేశారు. ఈ మ్యూజియంలోని వివిధ అంశాలు గిరిజనుల జీవనశైలికి అద్దం పడతాయి. థింసా నృత్యం, తదితర అంశాలకు సంబంధించిన ఆకృతులు అక్కడ వాస్తవికతను కళ్ల ముందు సాక్షాత్కరింపజేయడమే కాకుండా, హఠాత్తుగా చూస్తూ నిజరూపాలేనన్న భ్రమను కలిగిస్తాయి. మృదంగం, తుటును, సితార సూకి, కిన్నెర, కొమ్ము బూర, పిల్లనగ్రోవి, సనోడు, నాదస్వరం, టొయిలీ, హిరజావ తదితర 80 రకాల పరికరాలను ఈ మ్యూజియంలో భద్రపరిచారు.

సహజత్వం ఉట్టిపడే శిల్పాల ప్రదర్శన

గిరిజన మ్యూజియంలో రెండంతస్తుల విభాగంలో చూడచక్కని అర్చికలతో నిర్మితమైన శిల్పాల్లో సహజత్వం ఉట్టి పడుతుంది. మ్యూజియం మొదటి గదిలో వాయిద్య పరికరాలు, రెండో గదిలో వేటకు ఉపయోగించే సాధనాలు, మూడో గదిలో వ్యవసాయ పనిముట్లు, నాలుగో గదిలో గిరిజన నృత్యరీతులను తెలియజెప్పే మట్టిబొమ్మలు ఉన్నాయి. ఐదో గదిలో చూసిన వారు అక్కడి సహజత్వానికి ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురవుతారు. కొత్తగా చూసిన వారెవరైనా దానిని నిజమైన ఇల్లుగానే భ్రమిస్తారు. గిరిజన యువకుడు, ఇంట్లో సామగ్రి, గడ్డి, అచ్చం వాస్తవ దృశ్యాలను సాక్షాత్కరిస్తాయి. ఆ గదిలో గిరిజనుల వేషధారణ, జీవన పద్ధతులు,



థింసా నృత్యం జీవం ఉట్టిపడేలా కనిపిస్తాయి.

సంప్రదాయ జీవనవిధానానికి ప్రతీక

మైదాన ప్రాంత సంస్కృతి ప్రభావం పడుతున్నప్పటికీ, ఇక్కడి గిరిజనులు తమ ఆచార వ్యవహారాలను విడనాడక, వాటిని మరింతగా పదిలపరచుకుంటూ ప్రకృతి ఒడిలో సంప్రదాయ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. మానవ ప్రస్థానం సాంస్కృతికంగా ఎక్కడ ప్రారంభమై ఎన్ని మలుపులు తిరిగి ఈ స్థాయికి చేరుకుందో తెలుసుకోవడానికి ఈ గిరిజన మ్యూజియం ఒక వేదికగా ఉందనడంలో అతిశయోక్తి లేదు.













పర్యాటక సిరి.. అల్లూరి

(3వ పేజీ తరువాయి..) వారు కనిపించనంత దట్టంగా పొగమంచు పడుతుంది.

సుందరంగా డుడుమ

ప్రకృతి ప్రేమికుల్లో డుడుమ జలపాతం పేరు వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ జలపాతం పాడేరు నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుమారు 600 అడుగుల ఎత్తు నుంచి హోరు శబ్దం వేస్తూ దిగువకు జాలువారుతూ సందర్శకులకు కట్టిపడేస్తుంది. జలపాతాన్ని దగ్గరగా చూడాలంటే చాలా కిందకు దిగాల్సి ఉంటుంది. పాడేరు నుంచి ఆర్‌టిసి బస్సులు నడుస్తాయి. పెదబయలు, ముంచంగిపుట్టు మీదుగా చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో ముంచంగిపుట్టుకు ముందు ఎడమవైపు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జోలాపుట్టు జలాశయాన్ని కూడా సందర్శించవచ్చు.

జాలువారే జలపాతాలు

వీటితో పాటు మన్యంలో సొలభం పంచాయతీ కంఠవరం గ్రామానికి ఆనుకొని ఓ జలపాతం ఉంది. దీన్ని అక్కాచెల్లెమ్మల జలపాతంగా స్థానికులు పిలుస్తారు. కొయ్యూరు– బూదరాళ్ల మధ్య చింతవానిపాలెం సమీపంలో ఇసుకుల మడుగు జలపాతం ఉంది. పెదమాకరం పంచాయతీలో గానుగుల జలపాతం, పాడేరు మండలం సలుగు పంచాయతీ కందులపాలెం వద్ద జలపాతం, పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర గ్రామానికి సమీపంలో ఉన్న జలపాతం, అరకులోయ మండలంలో పద్మాపురం గార్డెన్స్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం వెళితే రణజిల్లేడ జలపాతం ఉన్నాయి. అలాగే అనంతగిరి మండలంలో అనంతగిరికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడిగుడ, బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో గేటు వలస జంక్షన్ నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటికి జలపాతాలు, హుకుంపేట మండలంలో హుకుంపేట నుంచి ఉప్ప రహదారి మీదుగా సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుర్గం పంచాయతీ సరసపాడు, పాటిగరువు గ్రామాల మధ్యలో జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

ఎంతో ప్రత్యేకం.. చాపరాయి జలపాతం

చాపరాయి జలపాతం డుంబ్రిగుడ మండలంలో ఉంది. చిన్నా, పెద్దా అన్న తారతమ్యం లేకుండా ఇక్కడ స్నానాలు చేస్తూ అందరూ ఆనందడోలికల్లో తేలియాడతారు. శీతాకాలంలో పొగమంచు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. పర్యాటకులను ఆకర్షించే విధంగా గిరిజన సంప్రదాయ థింసా నృత్యాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. జలపాతం ఆవరణలో పర్యాటకులను ఆకర్షించే విధంగా పూలతోటలను పెంచుతూ నందనవనాన్ని తీర్చిదిద్దారు. కాటేజీలు, గార్డెన్ల మధ్యన చిన్నపిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. కార్తీకమాసంలో అధిక సంఖ్యలో ఇక్కడకు పర్యాటకులు తరలివస్తారు.



చాపరాయి జలపాతం వద్ద సందర్శకులు